గ్రామాలకు జ్వరం

- పాణ్యం ఆరోగ్య కేంద్రంలో ఒక్క రోజే 42 కేసులు
- వేంపెంటలో డయేరియా
- పరిసరాల అపరిశుభ్రతే కారణం

వాతావరణం మారింది. వానలు కురుస్తున్నందు వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. తాగునీరు కలుషితమైంది. దీంతో జిల్లాలోని అనేక మండలాల్లో వ్యాధులు ప్రబలాయి. జ్వరం, జలుబు, దగ్గు, డయేరియా వంటి వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. పాణ్యం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఒక్క రోజే 42 కేసులు నమోదయ్యాయి. వేంపెంట గ్రామంలో డయేరియాతో అనేక మంది బాధపడుతున్నారు.



పాణ్యం అయ్యపురెడ్డి కాలనీ సమీపంలో రెండు నెలలుగా నిలిచిన మురుగు నీరు



పాణ్యం, ఆగస్టు 29 : మండలంలో జ్వరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఎనిమిది నెలలుగా నమో దవుతున్న జ్వరాల కేసులు రెండు నెలలుగా మరింత పెరిగాయి. ఈ ఏడాది జనవరి నుంచి ప్రతినెల దాదాపు 300 నుంచి 350 వరకు జ్వరాల కేసులు నమో దవుతున్నాయి. జూన్‌లో 450, జూలైలో 495 కేసులు నమోదయ్యాయి. పా ణ్యం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఒక్కరోజే 42 జ్వరం కేసులు నమోదైనట్లు వైద్యాధి కారులు తెలిపారు. ప్రతినెలా మలేరియా కేసులు30 నుంచి 35వరకు నమోద వుతున్నాయి. టైఫాయిడ్ కేసులు 10 నుంచి 15 కేసులు నమోదవు తు న్నాయి. మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెలలో రోజుకు మూడు నుంచి నాలుగు జ్వరం కేసులు నమోదుకాగా జూన్, జూలై నెలల్లో ఇరవై నుంచి 30 కేసులు నమోదయ్యాయి. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడంతో పాటు వాతావరణ మార్పు, వర్షాలతో జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వ్యాధులు సోకుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

వాతావరణం మార్పు జ్వరాల పెరుగుదలకు కారణం, వర్షాకాలంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా తాగునీటిని వేడిచేసి వడగట్టి తాగాలి. వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరిశుభ్రమైన, వేడి ఆహారం తీసుకోవాలి. ఎక్కువగా దగ్గు, జలుబు కేసులు నమోదవుతున్నాయి. జ్వరం వస్తే వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలి. సీహెచ్‌సీలో జ్వరం, దగ్గు, నొప్పులకు అవసరమైన లెరోసెట్రిజెన్, అంబ్రోగ్జిల్, డైక్లో, పారాసెటమాల్ వంటి మందులు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ రహెలా, సీహెచ్‌సీ వైద్యాధికారి



పాణ్యంలో దోమలకు ఆవాసంగా మారిన మురుగు

పరిసరాల అపరిశుభ్రతే కారణం : పాణ్యం మండలంలో పలు గ్రామాలలో పరిసరాల దుర్గంధంతో దోమలు పెరగడంతో జ్వరాలు పెరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాణ్యం అయ్యపురెడ్డి కాలనీలో దేవదాయ శాఖకు చెందిన స్థలంలో మూడు నెలలుగా మురుగు నీరు నిలచి దుర్గంధం వ్యాపిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ మురుగు నీటి వల్లే సమీప కాలనీలోని ప్రజలకు జ్వరాలు వస్తున్నాయి. గ్రామంలో అధికంగా అయ్యపురెడ్డి కాలనీలోనే జ్వరాల కేసులు నమోదైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ కాలనీలోని మురుగు నీటిని తొలగించాలని కోరుతున్నారు.

వ్యాధుల నివారణ ప్రచారం వరకే..

జిల్లా పంచాయతీ అధికారులు నిత్యం వ్యాధుల నివారణకు చర్యలు చేపడుతున్నామని ప్రచారం చేసుకుంటున్నా అమలులో మాత్రం చర్యలు చేపట్టడం లేదు. నిత్యం గ్రామీణ స్థాయి అధికారులకు వ్యాధుల నివారణపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నా పరిసరాల పరిశుభ్రతకు వీరి చర్యలు దోహదపడడంలేదు.

నోటీసులు అందజేశాం

మురుగు నీటి నిల్వపై దేవదాయ శాఖకు నోటీసులు అందజేశాం. నీటిలో ఆయిల్ బాల్స్ వేశాం. దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాం. మురుగు నీరు తరలింపునకు ఇబ్బంది ఏర్పడడంతో ప్రత్యామ్నాయంగా నీరు తరలించడానికి కాల్వ ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

- సులోచన, ఈఓఆర్‌డీ, పాణ్యం

వేంపెంటలో డయేరియా

13 మందికి వాంతులు, విరేచనాలు



వేంపెంట గ్రామంలో డయేరియా బాధితులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

పాములపాడు, ఆగస్టు 29: మండలంలోని వేంపెంట గ్రామంలో అనేక మంది గురువారం డయేరియా బారినపడ్డారు. గురువారం ఉదయం నుంచి గ్రామంలోని మసీదు, పింజరి వీధులలోని ప్రజలకు వాంతులు విరేచనాలయ్యాయి. వడ్డె నాగన్న, లింగస్వామి, లలితలను నంద్యాలకు తరలించారు. మున్నల్లా అనే వ్యక్తిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మరో ఇద్దరిని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మిగతా వారికి స్థానిక సచివాలయంలో మండల వైద్యాధికారులు నాగలక్ష్మి, గులాబ్జా వైద్యం అందిస్తున్నారు. గ్రామాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతారావు నాయక్, ఎపిడేమియాలజిస్ట్ రమేశ్, మురళీక్రిష్ణ, లక్ష్మీనారాయణ సందర్శించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, నిల్వ పదార్థాలు భుజించరాదని ప్రజలకు తెలిపారు. మశీదు వద్ద గల బోరును పరిశీలించారు. ఈ నీటి శాంపిల్స్‌ను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ల్యాబ్‌కు పంపించారు. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా సర్పంచ్ మాణిక్యమ్మ చర్యలు చేపట్టారు. గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని, ఇంటింటికి మినరల్ వాటర్‌ను అందిస్తున్నామని, ఆశావర్కర్లు ఇంటింటికి తిరిగి మాత్రలు పంపిణీ చేస్తున్నారని అధికారులు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ వేంపెంట సచివాలయంలో చికిత్స పొందుతున్న బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మాతా శిశు మరణాల రేటు జీరోకు రావాలి

కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 29: మాతా శిశు మరణాల రేటు జీరోకు రావాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో జిల్లా స్థాయి మెటర్నిటీ అండ్ ఛైల్డ్ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ప్రతి గర్భిణిపై ప్రత్యేక దృష్టి సారించి నిరంత రాయంగా వైద్య సేవలందించాలని అన్నారు. పోషక పదార్థాలు పంపిణీ చేసి మాతా శిశు మరణాల రేటును జీరో స్థాయికి తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మూడు నెలల్లో జరిగిన మరణాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు పునరావృతమైతే సంబంధిత అధికారులను సర్వీసు నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంత పెద్ద ప్రభుత్వ వ్యవస్థ ఉండి కూడా తల్లీబిడ్డలను సంరక్షించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. సర్వజన ఆస్పత్రి, డీసీహెచ్‌ఎస్‌లకు ప్రమాద సంకేత లక్షణాలు ఉన్నటువంటి గర్భిణులు వచ్చినప్పుడు వెంటనే తగు వైద్య చికిత్స అందించాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ డా.జఫ్రరుల్లా, జీజీహెచ్ గైనకాలజిస్టు డా.పద్మజ, ఐసీడీఎస్ పీడీ నిర్మల పాల్గొన్నారు.

నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలి

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



నంద్యాల క్రైం, ఆగస్టు 29 : నేరాలు, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సిబ్బందిని ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజల మధ్య ఉంటూ నేరా లు జరగకుండా చూస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టంలో వచ్చే ఫిర్యాదుల కు ప్రాధాన్యతనిస్తూ చట్టపరిధిలో నిర్ణీత సమ యంలో పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణం, గ్రామాల్లో విద్యాసంస్థలు, ముఖ్యమైన కూడళ్ల వద్ద, పట్టణ శివారులలో నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో మాట్లాడుతూ హైవే ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బ్లాక్‌పాయింట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు, టర్నింగ్‌లు, ముఖ్యమైన ప్రాంతాల్లో సిగ్నల్ బోర్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైవే మొబైల్స్ సహకారంతో హైవేలలో జరిగే దొంగతనాలపై నిఘా ఉంచాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి నేరాలు, కమ్యూనల్ గొడవలు జరగకుండా చూడాలని సూచించారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండి నివారణ చర్యలతోపాటు ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు తీసుకోవాల్సిన భద్రతా చర్యపై యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు సంబంధించి కమిటీలు ఏర్పాటు చేసుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు కేసుల వివరాలు తెలుసుకొని దర్యాప్తు వేగిరంగా ముగించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జడ్పీలో ముగిసిన బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 29: జిల్లా పరిషత్ ఆవరణలో గురువారం నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్ ముగిసింది. జడ్పీలోని సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ కార్యదర్శులకు నిర్వహించారు. విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ చేపట్టారు. పీఆర్ ఎస్‌ఈ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఈఈలు, డీఈఈలు బదిలీల ప్రక్రియ చేశారు. అదేవిధంగా సమావేశ భవనంలో సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ వెల్ఫేర్ కార్యదర్శులకు, నంద్యాల, కర్నూలు జిల్లా పంచాయతీ అధికారులు మంజులవాణి, టీవీ నాగరాజు నాయుడులు కార్యదర్శులకు బదిలీ కౌన్సెలింగ్ చేశారు. అయితే బదిలీ అయన వారంతా వచ్చే నెల పింఛన్ పంపిణీ అనంతరం రిలీవ్ కావాలని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వర్ణ రథంపై మల్లన్న



స్వర్ణ రథంపై స్వామి అమ్మవార్లు

శ్రీశైలం, ఆగస్టు 29: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు స్వర్ణరథోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున మల్లికార్జున స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 7:30 గంటలకు స్వర్ణరథాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామీజీ, స్వర్ణరథం దాత, నెల్లూరు జిల్లా కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు స్వర్ణరథానికి కొబ్బరికాయలు, గుమ్మడికాయలు సమర్పించారు. స్వామి, అమ్మవార్లు ఆశీనులైన స్వర్ణరథం ఆలయ మాడవీధుల్లో అశేష భక్తజనం నడుమ వైభవంగా జరిగింది. స్వర్ణరథం ఎదుట కోలాటం, చెక్కభజన, జానపద కళాకారులు భక్తులను ఆకట్టుకుంది. స్వర్ణరథోత్సవం భద్రతా ఏర్పాట్లను స్థానిక సీఐ ప్రసాదరావు, దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న పర్యవేక్షించారు.



రథోత్సవంలో పాల్గొన్న శివ సేవకులు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు



ఆలయ మాడ వీధుల్లో భక్తుల కోలాటం

స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుడు

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, ఆగస్టు 29: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు భారీగా తరలి రావడంతో మంత్రాలయం కిక్కిరిసింది. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభ దినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణ పల్లకిలో రాఘవరాయడి బృందావన ప్రతిమను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఘనంగా ఊరేగించారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో అన్నపూర్ణ భోజనశాల, మహా ముఖ ద్వారం, ప్రధాన రహదారులు, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో పూజ సామగ్రికి, ప్రైవేట్ లాడ్జిలకు డిమాండ్ పెరిగింది.

గ్రేడ్-2 వీఆర్వోలకు నేడు కౌన్సెలింగ్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 29: జిల్లాలోని గ్రేడ్-2 వీఆర్వోలకు శుక్రవారం రెవెన్యూ అధికారులు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని సుమారు 70 మంది గ్రేడ్-2 వీఆర్వోలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం డీఆర్వో కార్యాలయంలోని ఉమ్మడి జిల్లా అధికారులతో కర్నూలు ఆర్డీవో మధుసూదన్‌రావు బదిలీల కౌన్సెలింగ్‌పై చర్చించారు. కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ నుంచి ఆఫీసు సబార్డినేట్స్ వరకు కర్నూలు నుంచి నంద్యాలకు 16 మంది, నంద్యాల నుంచి కర్నూలుకు 48 మంది, మ్యూచువల్ ఆరుగురు, రిక్వెస్టు బదిలీలకు 42 మంది దరఖాస్తు చేసుకున్నారు.

వైద్య శాఖ ఉద్యోగులకు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 29: ఈ నెల 30న వైద్య ఆరోగ్య శాఖలో 99 మంది పీహెచ్ఎన్ నాన్ టీచింగ్‌లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా.పద్మావతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా పలుకూరు పీహెచ్‌సీలో పని చేస్తున్న ఎం.గంగ నాగేశ్వరి సీహెచ్‌వోగా పదోన్నతి జాబితాలో ఉన్నారు. కడప జోన్-4 పరిధిలో 18 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలకు సూపర్‌వైజర్ ఫీమేల్‌గా పదోన్నతుల కౌన్సెలింగ్ ఈ నెల 31న కడప ఆర్డీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్డీ డా.వై.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి పి.అరుణ కుమారి (సున్నిపెంట) బి.శారద (ఉప్పలపాడు) బి.భాగ్యమ్మ (పర్ల), జే స్వర్ణలత (కొత్తబురుజు), బి.మంగమ్మ (హొళగుంద), ఎస్. కొత్తురమ్మ(కృష్ణగిరి)లకు పదోన్నతులు లభించనున్నాయి. ఈ నెల 30న పది మంది సీనియర్ అసిస్టెంట్లకు ఆఫీస్ సూపరింటెండెంట్లుగా పదోన్నత్తులు లభించనున్నాయి. బాలస్వామి (ఆస్పరి), రాజు (సీ.బెళగల్), సాయి ప్రసాదరావు (జిల్లెల), కె.శ్రీనివాసులు (ఆర్‌టీసీ మేల్), పదోన్నతుల జాబితాలో ఉన్నారు. కడప జోన్-4 పరిధిలో పని చేస్తున్న నలుగురు సీనియర్ హెడ్ నర్సులకు నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా పదోన్నతులు లభించనున్నాయి. కర్నూలు నుంచి కర్నూలు జీజీహెచ్‌లో పని చేస్తున్న సీనియర్ హెడ్ నర్సు జి.విమలమ్మకు నర్సింగ్ గ్రేడ్-2గా పదోన్నతి లభించనుంది

గర్భిణికి అరుదైన శస్త్ర చికిత్స

కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 29: నంద్యాల జిల్లా బండిఆత్మకూరుకు చెందిన ఓ గర్భిణికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనిక్ వైద్యులు ప్రసవంతోపాటు కడుపులో ఉన్న పెద్ద గడ్డలను శస్త్ర చికిత్స చేసి తొలగించారు. గురువారం గైనిక్ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ శ్రీలక్ష్మి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఈ అరుదైన శస్త్ర చికిత్స గురించి వివరించారు. బండి ఆత్మకూరుకు చెందిన గర్భిణిని కాన్పు కోసం నంద్యాల, నందికొట్కూరు, కర్నూలులోని చాలా హాస్పిటల్స్‌ను తీసుకెళ్లినా వైద్యులు ముందుకు రాకపోవడంతో ఈ నెల 13న కర్నూలు జీజీహెచ్‌కు వెళ్లారు. అక్కడ ఆమెకు వైద్యులు పరీక్షలు చేయగా.. గర్భంతోపాటు కడుపులో రెండు పెద్ద గడ్డలు కూడా పెరుగుతున్నట్లు గుర్తించారు. ఈ నెల 20వ తేదీన గైనిక్ యూనిట్-1 చీఫ్ డా. శ్రీలక్ష్మి అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఉమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. నర్మద, పీజీలు, అనస్థీషియా ప్రొఫెసర్ డా. సుధీర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. మురళి ప్రభాకర్ బృందం గర్భిణికి ప్రసవంతోపాటు గడ్డలను తీసి ప్రాణాన్ని కాపాడారు. ఈ సందర్భంగా గైనిక్ హెచ్‌వోడీ డా. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈ అరుదైన శస్త్ర చికిత్సను వైద్యపరి భాషలో సిజేరియన్ మయోమార్టమి అంటారని తెలిపారు. ఒక గడ్డ రెండు కేజీలు, మరో గడ్డ 800 గ్రాములు ఉన్నాయని వివరించారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీకి నేడు కౌన్సెలింగ్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 29: నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు శుక్రవారం బదిలీలకు సంబంధించి ఫిజికల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులు జరిగే కౌన్సెలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ కార్యదర్శులను బట్టి ప్రత్యేకంగా అధికారులను నియమించారు. అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శులకు రెవెన్యూ అధికారి కేఎండీ జునైద్, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు మేనేజర్ చిన్నరాముడు, వెల్ఫేర్ కార్యదర్శులకు టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, శానిటేషన్ కార్యదర్శులకు ఎంహెచ్ఓ కే విశ్వేశ్వరరెడ్డి, అమ్యూనిటీస్‌కు డీఈఈ రాజశేఖర్, ప్లానింగ్ కార్యదర్శులకు డీసీపీ సంధ్య బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కౌన్సిల్ హాలులో కావాల్సిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఈలు రవిప్రకాష్ నాయుడును ఆదేశించారు.

రేపటి నుంచి గూటుపల్లె ఉరుసు

31న గంధోత్సవం, సెప్టెంబరు 1న ఉరుసు


ముస్తాబైన పెద్దరాజుస్వామి దర్గా

బేతంచెర్ల, ఆగస్టు 29: మండలంలో మత సామరస్యానికి ప్రతీక అయిన గూటుపల్లి ఉరుసు ఈ నెల 31న ప్రారంభం కానుంది. సెప్టెంబరు 1న ఉరుసు, 2న జియారత్ జరుగుతాయి. గూటుపల్లెలో వెలసిన హజరత్ సయ ద్‌షా అబ్దుల్ రెహిమాన్ ఇద్రూస్ బాషా ఉరఫ్ పెద్దరాజుల స్వామి ఉరుసు మతసామరస్యానికి ప్రతీకగా ప్రసిద్ధి చెందింది. ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి దర్గాను దర్శించుకుని ఫతేహాల్ సమర్పించుకుంటారు. ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా నిర్వాహకుడు గురు సయ్యద్ షా బాషా ఖాద్రి గురువారం తెలిపారు

వారణాసికి వృద్ధుడి పాదయాత్ర

- ఫిబ్రవరి నుంచి 2,800 కి.మీ. నడక
- మంత్రాలయానికి చేరుకున్న భక్తుడు గోపాలకృష్ణ


పాదయాత్ర పూర్తి చేసుకున్న వృద్ధుడిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

మంత్రాలయం, ఆగస్టు 29: కర్ణాటక సిరిగుప్ప గ్రామానికి చెందిన వృద్ధుడు గోపాలకృష్ణ (68) వారణాసికి 2,800 కి.మీ. పాదయాత్ర చేసి గురువారం మంత్రాలయానికి చేరుకున్నాడు. ఆర్యవైశ్య సత్రం సిబ్బంది ఆయనను సన్మానించారు. వారణాసి కాశీవిశ్వనాథ స్వామి దర్శనార్థం ఫిబ్రవరి 22వ తేదీన సిరిగుప్ప నుంచి బయలుదేరి పండరీపురం, ఉజ్జయిని, మహాకాళేశ్వర్, షిరిడీ, త్రయంబకేశ్వర్, ప్రయాగ మీదుగా వారణాసికి చేరుకున్నాడు. రోజుకు 15 కి.మీ. ప్రకారం నడిచి, ఆగస్టు 15న వారణాసి చేరుకుని 9 రోజులు పూజలు చేశాడు. అక్కడి నుంచి భక్తుల సహకారంతో విమానం ద్వారా బెంగళూరుకు చేరి అనంతరం మంత్రాలయానికి చేరుకున్నాడు.


రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

వెలుగోడు, ఆగస్టు 29: వెలుగోడు అబ్దుల్లాపురం రహదారిలో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వెలుగోడు పట్టణానికి చెందిన మహేష్ తన వ్యక్తిగత పనులపై అబ్దుల్లాపురం గ్రామానికి బయలు దేరాడు. వెలుగోడుకు చెందిన రామాంజనేయులు వేల్పనూరుకు వెళ్లి తిరిగి వెలుగోడుకు బైక్‌పై బయలు దేరాడు. ఈ రెండు వాహనాలు వెలుగోడు- అబ్దులాపురం గ్రామాల మధ్య ఢీకొన్నాయి. ఈ రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు (36) అక్కడి కక్కడే మృతి చెందగా మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మహేష్‌కు వెలుగోడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. రామాంజనేయులు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు.

రేపు పత్తికొండకు సీఎం

- పుచ్చకాయలమాడ గ్రామంలో పింఛన్ల పంపిణీ
- ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్లు


ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



పత్తికొండ, ఆగస్టు 29: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 31న పత్తికొండ పర్యటనకు రానున్నారు. పత్తికొండ మండలం పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హైస్కూల్ సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో శివాలయం వద్ద గ్రామసభ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ నవ్య గురువారం సాయంత్రం గ్రామానికి చేరుకొని హెలిప్యాడ్, గ్రామ సభ ప్రాంతాలను పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద, గ్రామంలో ఎలాంటి భద్రత ఏర్పాట్లు ఉండాలన్న అంశంపై అధికారులకు సూచనలు చేశారు. పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. పత్తికొండ మండల పరిషత్ సమావేశంలో కలెక్టర్, ఎస్పీలు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ఉదయం 12 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా పుచ్చకాయలమాడకు చేరుకుంటారని అన్నారు. హెలిప్యాడ్ నుంచి ప్రత్యేక వాహనంలో పింఛన్‌దారుల ఇళ్లకు చేరుకుంటారని, అక్కడి నుంచి గ్రామ సభకు వెళ్తారని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పూర్తిస్థాయి భద్రత ఉంటుందని, ఆయన గ్రామంలో పర్యటించే సమయంలో ప్రజలు, పార్టీ నాయకులు పోలీసులకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ వెంకట్రామయ్య, తహసీల్దార్ వెంకటలక్ష్మి, సీఐలు జయన్న, పులిశేఖర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా..

- శనివారం మధ్యాహ్నం 12:30 గంటలకు కర్నూలు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకుంటారు.
- 12.40 గంటలకు హెలికాప్టర్‌లో పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామానికి బయలుదేరుతారు.
- 1:05 గంటలకు పుచ్చకాయలమాడ గ్రామం చేరుకుంటారు.
- 1:20 గంటల నుంచి 1:50 గంటల వరకు గ్రామంలో ఇంటింటి పింఛన్‌ను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్తారు. కాలినడకన గ్రామంలోని కాశీవిశ్వేశ్వర ఆలయం చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు.
- 2:05 నుంచి 3:05 గంటల వరకు ఆలయ సమీపంలో పుచ్చకాయలమాడ గ్రామస్థులతో నిర్వహించే గ్రామసభలో పాల్గొని వారితో ముఖాముఖి మాట్లాడతారు.
- 3:15 హెలికాప్టర్‌లో బయలుదేరి 3:40కి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లిపోతారు.


హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

యువత ధ్యాన్‌చంద్ స్ఫూర్తిని పొందాలి

ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత



ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జేసీ

కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 29: మేజర్ ధ్యాన్‌చంద్ సాధించిన విజయాలతో యువత స్ఫూర్తి పొందుతూ క్రీడల్లో ఉన్నత స్థానాల్లో రాణించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి పేర్కొన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నగరంలో నిర్వహించిన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించి వారిని గౌరవించుకుంటున్నామని అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా అవుట్‌డోర్ స్టేడియంలో ఆయన విగ్రహానికి ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ నవ్య, డీఎస్‌డీవో భూపతిరావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సెట్కూరు సీఈవో పీవీ రమణ, ఒలంపిక్ అసోసియేషన్ సభ్యులు రామాంజనేయులు, అధికారులు, క్రీడా ప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు

పార్లమెంటులో తెలుగులో మాట్లాడే అవకాశం దక్కింది

- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు


ఎంపీ నాగరాజును సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 29: పార్లమెంటులో తెలుగులో మాట్లాడే అరుదైన అవకాశం తనకు దక్కిందని, అందుకు ఎంతో సంతోషంగా ఉందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఎంపీ నాగరాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. వారు తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తెలుగు భాష ఒక సుసంపన్నమైన భాష అని, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకోవడం సంతోషదాయకమని అన్నారు. అనంతరం తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జేఎస్ఆర్‌కే శర్మ, కవులు మారేడు రాముడు, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, తొగట సురేష్‌బాబు, అష్టావధాని డాక్టర్ బొరెల్లి హర్షలను అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కూచిపూడి నృత్యగురువు కరీముల్లా, కళాకారులు యాగంటీశ్వరప్ప, బాల వెంకటేశ్వర్లు, గాండ్ల లక్ష్మన్న, చంద్రకంటి మద్దయ్య, లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరానికి పరిమితులు ఉన్నాయి

బొజ్జా దశరథరామిరెడ్డి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 29: పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రజల జీవనాడి అని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నదని, వాస్తవానికి ఆ ప్రాజెక్టుకు అనేక పరిమితులు ఉన్నాయని సాగునీటి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి హాస్పిటల్ సమావేశ హాలులో సాగునీటి నిపుణులతో సమావేశం జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ 2015 జూన్ 18, 19తేదీల్లో ప్రభుత్వం తీసుకువచ్చిన లెటర్ ఆధారంగా చూసినప్పుడు కృష్ణా డెల్టాకు వాడుకోవాల్సిన నీళ్లు నాగార్జున సాగర్ డౌన్ స్ట్రీమ్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు, గాలేరు, మున్నేరు, మూసీల నుంచీ 100 టీఎంసీలను వాడుకోవాల్సి ఉంటే, ఆ ప్రాంతం 20 టీఎంసీలు మాత్రమే తీసుకోగలుగుతున్నదని, మిగతా నాగార్జున సాగర్ నుంచి తీసుకునేలా ఆ లేఖలో పొందుపరిచారని చెప్పారు. దీని వల్ల కృష్ణా డెల్టాకు చట్టబద్ధంగా అలాట్ చేసిన వంద టీఎంసీల నీటిని నిలబెట్టుకోవడానికి రిజర్వాయర్ లేకపోవడం వల్ల ఆ నీటినంతా సముద్రంపాలు చేస్తూ మిగిలిన నీటినంతా నాగార్జున సాగర్ నుంచో, శ్రీశైలం ప్రాజెక్టు నుంచీ తీసుకురావడం వల్ల ఇటు నాగార్జున సాగర్ ఆయకట్టుకు, లేదా రాయలసీమకు అన్యాయం జరుగుతున్నదన్నారు. రాష్ట్రంలోని సాగు భూమిలో రాయలసీమ 42 శాతం భూభాగం ఉన్నందు వల్ల సాగు నీటి బడ్జెట్‌లో 42 శాతం నిధులను సీమ సాగు నీటికి ఖర్చు పెట్టాలన్నారు.

పోలీసులకు ఎస్పీ అభినందనలు

కోవెలకుంట్ల, ఆగస్టు 29 : మద్యం మత్తులో లారీ నడుపుతున్న డ్రైవరు నుండి ప్రజల ప్రాణాలను కాపాడిన ఇద్దరు పోలీసులను ఎస్పీ ఆది రాజ్‌సింగ్ రాణా అభినందించి వారికి రివార్డు ప్రకటించారు. సీఐ హనుమంతనాయక్ తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన పేరం సుదర్శన్‌రెడ్డి మద్యం తాగి బుధవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో సిమెంటు లోడు ఉన్న 12 టైర్ల పెద్ద లారీని బనగానపల్లె నుండి ఆళ్లగడ్డకు డ్రైవ్ చేస్తుండగా కోవెలకుంట్ల పట్టణంలోని అంకాలమ్మ గుడి వద్ద కానిస్టేబుల్ ఇంతియాజ్ హుసేన్, సుధాకర్ గమనించారు. లారీ డ్రైవరును అదుపులోకి తీసుకుని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వద్దకు తీసుకుని వచ్చారు. ఎస్ఐ కేసు నమోదు చేసి కోవెలకుంట్ల కోర్టులో డ్రైవరును హాజరుపరిచారు. న్యాయాధికారి షేక్ అబ్దుల్ రహిమాన్ సదరు లారీ డ్రైవరుకు 30 రోజులు జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవరు బారి నుంచి ప్రజలను కాపాడిన కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించారు.

మద్యం మత్తులో దాడులు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 29: నంద్యాలలో మద్యం మత్తులో కత్తులతో దాడులకు తెగబడ్డారు. వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొమ్మలసత్రంలో బుధవారం అర్ధరాత్రి అదే ఏరియాకు చెందిన ప్రకాష్, సుబ్బరాయుడు మద్యం సేవించి వాగ్వాదానికి దిగారు. సుబ్బరాయుడు తన వద్ద ఉన్న కత్తితో ప్రకాష్‌పై దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయలు కావడంతో స్థానికులు నంద్యాల జీజీహెచ్‌కు తరలంచారు. అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రిఇకి తరలించారు.

మద్యం మత్తులో గొంతు కోసి పరార్

నంద్యాల పట్టణ శివార్లలోని కేసీ కెనాల్ గట్టుపై ఇద్దరు యువకులు గురువారం మద్యం తాగి ఘర్షణపడ్డారు. విశ్వనగర్‌కు చెందిన బుజ్జి తన వద్ద ఉన్న కత్తితో నందమూరి నగర్ షేక్ బషీర్‌పై దాడి చేసి పరారయ్యారు. గాయపడ్డ బషీర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్‌గా రవీంద్రబాబు

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 29: ఉమ్మడి జిల్లాలోని నగర పాలక, మున్సిపాలిటీల కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నగర పాలక సంస్థ కమిషనర్‌గా రవీంద్రబాబును నియమించారు. ప్రస్తుతం ఆయన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పోస్టింగ్ కోసం వేచి ఉన్న వి.మల్లికార్జునను ఆదోని కమిషనర్‌గా, రెవెన్యూ ఆఫీసర్ గ్రేడ్-3 ఎస్.బేబిని నందికొట్కూరుకు బదిలీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ టి. సుధాకర్‌రెడ్డిని మాతృ సంస్థ ఆడిట్ శాఖలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా నందికొట్కూరు మున్సిపాలిటీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కేవీ కృష్ణారెడ్డిని కడప మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ ఎం.మంజులత గౌడును నందికొట్కూరు మున్సిపాలిటీ మేనేజర్‌గా నియమించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ కమిషనర్ ఎల్.రమేష్‌బాబును నగర పాలక సంస్థ సూపరింటెండెంట్‌గా నియమించారు. అయితే ప్రస్తుతం జరిగిన బదిలీల్లో ఆయనను బేతంచెర్ల కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.హరిప్రసాద్‌ను డీఎంఏలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అనంతపురం జిల్లా గుత్తి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. శ్రీనివాసులును కర్నూలు నగర పాలక సంస్థకు కేటాయించి, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మున్సిపాలిటీకి కమిషనర్‌గా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, ఆగస్టు 29: మండలంలోని వంకమిట్టపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు(40) మృతి చెందాడు. అనంతపురం యాడికి మండలంలోని వేములపాడు గ్రామానికి చెందిన నాగరాజు బైకుపై స్థానిక మండలంలోని కంబగిరిస్వామి దేవస్థానానికి వచ్చాడు. దైవ దర్శనం కాగానే తిరిగి సొంత ఊరికి బయలుదేరాడు. వంకమిట్టపల్లి సమీపంలోకి రాగానే అదుపు తప్పి బైకు బోల్తా పడింది. ఈ ఘటనలో నాగరాజు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రాచర్ల పోలీసులు తెలిపారు.

కల్లూరును వీడని ఘనుడు

- కలెక్టర్ బదిలీ ఉత్తర్వులు బేఖాతర్
- ఇక్కడే వీఆర్వోగా కొనసాగుతున్న మద్దిలేటి
- ఆదేశాలు అమలు చేయడంలో తహసీల్దారు విఫలం


అగస్టు 13వ తేదీన కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వో ఇచ్చిన బదిలీ ఉత్తర్వులు

కల్లూరు, ఆగస్టు 29: ఆ అవినీతి ఘనుడు కల్లూరును వీడడం లేదు. కలెక్టర్ బదిలీ ఉత్తర్వులను సైతం లెక్క చేయడం లేదు. కల్లూరు వీఆర్వో మద్దిలేటి అవినీతి ఆరోపణలపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సదరు వీఆర్వోను కలెక్టర్ ఆదేశాలతో అగస్టు 13న డిప్యుటేషన్‌పై దేవనకొండ మండలానికి బదిలీ చేస్తూ డీఆర్వో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే నేటికీ అతను ఇక్కడి నుంచి రిలీవ్ కాకుండా కల్లూరులోనే కొనసాగుతుడడం పలు అనుమానాలకు తావిస్తోంది. క్రమశిక్షణ చర్యల ఉత్తర్వులను తహసీల్దార్ తుంగలో తొక్కడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ నేతల సిఫారసుతో ఆపుకున్నాడట..

కల్లూరు వీఆర్వోగా పని చేస్తున్న మద్దిలేటి అనేక అక్రమాలకు పాల్పడినట్టు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ, దేవాలయ, వాగు పోరంబోకు, వక్ఫ్‌బోర్డు భూములను దోచిపెట్టారని అతనిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే కర్నూలు నగరంలో ఖరీదైన డాక్టర్స్ కాలనీలో 11 సెంట్ల స్థలం కొని ఐదు సెంట్లలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నాలుగు అంతస్తుల భవనం నిర్మించారనే వార్త చక్కర్లు కొట్టింది. అనేక ఆరోపణల నేపథ్యంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో అవినీతి ఘనాపాటి అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి కర్నూలు ఆర్డీవోను విచారణకు ఆదేశించారు. వీఆర్వో మద్దిలేటిపై విచారణ జరిపిన ఆర్డీవో నివేదికను కలెక్టరుకు అందజేశారు. దీంతో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆగస్టు 13న సదరు వీఆర్వోను దేవనకొండ మండలం తెర్నేకల్-2కు డిప్యూటేషన్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీఆర్వో మధుసూదన్‌రావు కల్లూరు తహసీల్దారు కార్యాలయానికి ఉత్తర్వులు పంపి కలెక్టర్ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. అయితే కలెక్టర్ ఆదేశాలు ఇచ్చి 17 రోజులైనా బదిలీ ఉత్తర్వులను అమలు చేయడంలో కల్లూరు తహసీల్దారు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలాఉంటే వైసీపీ నేతల సిఫారసుతో బదిలీ కాకుండా చేసుకున్నట్లు తోటి ఉద్యోగులతో సదరు వీఆర్వో చెప్పుకుంటుండటం గమనార్హం.

ఈ విషయంపై తహసీల్దారు కె.ఆంజనేయులును వివరణ కోరగా వీఆర్వో రెగ్యులర్ ట్రాన్స్‌ఫర్‌లో బదిలీ అవుతాడని చెప్పారు. రెండు రోజులు ఆగితే రెగ్యులర్ బదిలీల్లో ఇక్కడి నుంచి వెళ్లిపోతాడన్నారు. ఇదే విషయంపై నాలుగు రోజుల ముందు కూడా తహసీల్దారును అడగ్గా రికార్డులు హ్యాండోవర్ చేయగానే రిలీవ్ చేస్తామని చెప్పడం కొసమెరుపు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

● విద్యా సంస్థల్లో ఘనంగా వేడుకలు ● గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి ● తెలుగు ఉపాధ్యాయులకు సన్మానం



మహానంది: తిమ్మాపురంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



పాములపాడు: వేంపెంట గ్రామంలో..



బండిఆత్మకూరు: గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు



నందికొట్కూరు: విద్యార్థికి బహుమతి ప్రదానం

జిల్లా వ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గిడుగు వేంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు ప్రముఖులు తెలుగు భాషా గొప్పదనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు తెలుగు భాష గురించి వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆత్మకూరు, ఆగస్టు 29: మాతృభాష పరిరక్షణకై ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని తెలుగు అధ్యాపకుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

వెలుగోడు: వెలుగోడు ఏపీ మోడల్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నళిని తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని ఎం. తిమ్మాపురంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, ఏఈఓలు రామసుబ్బయ్య, నారాయణ, గ్రీన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనిధి రఘువీర్, శ్రీనివాసరెడ్డి, జానపద కళాకారులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని శింగవరం జడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం దస్తగిరి, చంద్రశేఖర్‌రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలుగుభాష ఆంధ్ర రాష్ట్ర వికాస ఉద్యమ కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ హాజరయ్యారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

● అలాగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యక్షుడు అన్వర్ హుస్సేన్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా.పరిమళా దేవి, అకడమిక్ కోఆర్డినేటర్ డా.రఘుపతి రెడ్డి, గ్రంథాలయాధికారి రవీంద్రనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని హెచ్ఎం కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మిడుతూరు: కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం శ్రీధర్ కిశోర్, తెలుగు ఉపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, పీడీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చిన్న స్వామి, నరసింహారావు, మల్లు నాగేశ్వర రెడ్డి, సరస్వతి, చాంద్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.



మిడుతూరు: కడుమూరులో..



వెలుగోడు మోడల్ స్కూల్‌లో..



ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

గడువులోపు పూర్తి చేయాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 29: సమగ్రశిశు అభివృద్ధి పథకం కింద గర్భిణులు, బాలింతలు, చంటి పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక ఆహార పదార్థాలు అందించడంతో పాటు వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను కూడా గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వందరోజుల ప్రణాళి అమలుపై సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 1663 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక పదార్థాలు అందించడంతో పాటు వందరోజుల ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లాలో 142 సంక్షేమ హాస్టళ్లు ఉన్నప్పటికి చిల్డ్రన్స్‌హోమ్స్ ఎందుకు ఏర్పాటవుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో బాల్యవివాహాలు నిషేదిత కమిటీలను ఏర్పాటుచేసి బాల్యవివాహాలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, అంగన్‌వాడీ కార్యకర్త, పాఠశాల హెడ్‌మాస్టర్, స్వయం సహాయక సంఘాల మహిళ తదితర సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రవేట్ సెక్టార్లలో సమాచార హక్కు చట్టం బోర్డు తరహాలోనే లైంగిక వేధింపుల నివారణ బోర్డును ప్రదర్శించాలన్నారు.

లక్ష్యాన్ని ఛేదించాలి: జేసీ

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 29: ప్రభుత్వం నిర్దేశించిన రెవెన్యూ అంశాలను నిర్ణీత కాల పరిమితిలోపు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్ని మండలాల తహశీల్‌దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీజీఆర్ఎస్, భూసేకరణ, రీసర్వే, ఓటర్ల జాబితా సవరణ, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు.

'ఆటోమెటెడ్ టెస్టింగ్ స్టేషన్లలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు'

ఆత్మకూరు, ఆగస్టు 29: ఇకపై ఆటోమెటెడ్ టెస్టింగ్ స్టేషన్లలో అన్ని రకాల వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ చేయనున్నట్లు ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి భారీ గూడ్స్, ప్యాసింజర్, మినీ, లైట్ తదితర వాహనాలన్ని తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. అయితే ఆర్‌టీవో కార్యాలయాల్లో కాకుండా ఆటో మేటెడ్ టెస్టింగ్ స్టేషన్లలో సర్టిఫికేట్లను జారీ చేయను న్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆత్మకూరు, వెలు గోడు, పాములపాడు, కొత్తపల్లి, మిడ్తూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, శ్రీశైలం, నందికొట్కూరు మండలాలకు చెందిన అన్ని వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ కోసం చాబోలు గ్రామంలో శివవంకర్ ఎంటర్ ప్రైజెస్‌లో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫకెట్లు పొందనట్లయితే మోటారు వెహికల్ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

క్రీడా దినోత్సవం



జూపాడుబంగ్లా: పిరమిడ్ విన్యాసం చేస్తున్న విద్యార్థులు



నంద్యాలలో ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రవికృష్ణ, ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 29: నంద్యాల పట్టణంలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపనున్నట్లు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని క్రీడా భారతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. క్రీడా భారతి అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ అధ్యక్షతన 3కే రన్ కార్యక్రమం నిర్వహించారు. క్రీడా భారతి రాయలసీమ జోనల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ,శాంతి నికేతన్ విద్యా సంస్థల చైర్మన్, క్రీడా భారతి జిల్లా అధ్యక్షుడు సూర్యదేవర సుధాకర్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. క్రీడా జ్యోతిని ఎన్ఎండీ ఫిరోజ్ వెలిగించగా 3కే రన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించిన నంద్యాల క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.

● జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. స్పోర్ట్స్ అథారిటీ జిల్లా అధికారి రాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, జిల్లా ఒలింపిక్స్ సంఘం మాజీ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు, కళాశాల పాఠశాలల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక టెక్కె మార్కెట్ యార్డు నుంచి పద్మావతి నగర్‌లోని ఇండోర్ స్టేడియం వరకు ర్యాలీ కొనసాగింది.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలోని అంబేడ్కర్ గురుకులంలో క్రీడా దినోత్సవం, తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. 'చదువు మా బాధ్యత, ఆటలు మా హక్కు' అని తెలుగులో మాట్లాడే పోటీ, క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పిరమిడ్ విన్యాసాలు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మూర్తి, పీడీ విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: క్రీడలపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని శ్రీశైలం ట్రస్టుబోర్డు చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగూర్‌ఖాన్, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ వస్సీల్ మున్నా పేర్కొన్నారు. ఈమేరకు గురువారం హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని స్థానిక కేవీకే స్టేడియం ఆధ్వర్యంలో పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీని వారు ప్రారంభించారు. నాయకులు నూర్‌బేగ్, జునీద్‌బాషా, రవీంద్రబాబు, ఎస్ఎంసీ చైర్మన్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

● జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం పలు క్రీడాపోటీలను నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ జిష్ణు నాగ్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, అధ్యాపకులు బహుమతులు ప్రదానం చేశారు.

గడివేముల: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరిమద్దెల హైస్కూల్, కేజీబీవీ, బిలకలగూడురు ఎంపీయూపీ, స్పెషల్ స్కూల్, బుజనూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, గడివేముల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు జిందాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంఈవో విమల వసుంధరాదేవి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విక్టర్ ఇమ్మానుయేలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హిందూ ధర్మాన్ని పరిరక్షించుకుందాం'



మాట్లాడుతున్న వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి

ఆత్మకూరు, ఆగస్టు 29: హిందూధర్మాన్ని పరిరక్షించుకుందామని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మళ్ల సత్యం పేర్కొన్నారు. గురువారం వీహెచ్‌పీ 60ఏళ్ల షష్టిపూర్తి వేడుకను పురస్కరించుకుని స్థానిక వేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో హిందూ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఏపీ ప్రసాద్, కాకర్ల రాముడు, నాగరాజు, గరుడాద్రి సుదర్శన్, శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి, రాసంశెట్టి రాజశేఖర్, భానుమూర్తి, ఆదవేణి పవన్ ఉన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది, ఆగస్టు 29: మహానంది క్షేత్రంలోని నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన నారాయణ దంపతులు రూ.50,111 విరాళంగా అందచేసినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునయ్య తెలిపారు. దాతలను ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వేద పండితులు ఆశీర్వదించి స్వామి మెమెంటో, అన్నదానం బాండు, ప్రసాదాలను అందజేశారు.

'వైద్యులు అందుబాటులో ఉండాలి'

కొత్తపల్లి, ఆగస్టు 29: గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న రోగులకు ఎల్లవేలలా అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సంబంధిత వైద్యులను ఆదేశించారు. గురువారం మలేరియా అధికారి మండలంలోని ఎర్రమఠం, గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అలాగే వైద్యులు అకీం రషీద్, విజయేంద్రలను రోజువారి ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే కపిలేశ్వరంలో ఈ నెల 23న రమణమ్మ, లావణ్య అనే మహిళలు మలేరియా వ్యాధి బారిన పడటంతో అక్కడకు వెళ్లి పరిశీలించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో మలేరియా అధికారి ప్రభుత్వ వైద్యాధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడ్డి, సిబ్బంది సత్యంరెడ్డి, నిర్మలాజయమణి, శాంతమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 29: నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో జూపాడు బంగ్లా మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. వీరు అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గిరీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. చేరిన వారు తరిగోపుల ఎంపీటీసీ సుజాత, వైసీపీ నాయకులు శ్రీను, సుధాకర్, కొలమయ్య, కృష్ణుడు, మస్తాన్ టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ప్రశంసా పత్రం

పాములపాడు: మన టీడీపీ యాప్‌లో ఉత్సాహంగా పనిచేసిన తుమ్మలూరు గ్రామ టీడీపీ నాయకులు అలీసాహెబ్‌కు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకరవ్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ప్రశంసా పత్రం అందించి అభినందించారు. మన టీడీపీ యాప్‌లో చురుగ్గా పాల్గొంటూ సేవలందించినందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గుర్తించి వీరికి ప్రశంసా పత్రం పంపించారని చెప్పారు. టీడీపీ నాయకులు ఏసేపు, ఇబ్రహీం, శివరామయ్య, బండశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి'

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 29: సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు అధికారులకు సూచించారు. గురువారం నందికొట్కూరు కొణిదేల గ్రామంలో బాలుర సంక్షేమ గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీఎం మధు సుదర్శన్, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు వసతి గృహాలను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసి దేవి, తహసీల్దార్ రత్న రాధిక గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండలంలోని వెంకటాపురం వసతి గృహాన్ని, పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని, బాలుర ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లను వారు వేరు వేరుగా ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. డీటీ హరి ప్రసాద్, ఈవోఆర్డీ మోహన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ కళ్యాణ్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలకు సక్రమంగా వెళ్లాలి'

పాణ్యం, ఆగస్టు 29: గిరిజన విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బసీరున్నీసాబేగం సూచించారు. గురువారం స్థానిక ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. చెంచు విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పిల్లలు పాఠశాలకు సక్రమంగా హాజరయ్యేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. లేబర్ ఆఫీసర్ విద్యావతి, అలెస్కో కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి, హెచ్ఎం జ్ఞాన విజయభారతి, శివసాయిప్రసాద్, సంపూర్ణ రావు, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 29: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాలలోని 22వ వార్డు రైతు నగరంలో గురువారం ఫిరోజ్ పర్యటించారు. వార్డులోని సమస్యలనుఅ డిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వార్డులో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జీవో నెంబరు 143ను రద్దు చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 29: రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆటంకంగా ఉన్న జీవో 143ను రద్దు చేయాలని ఏపీ తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘం నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం జిల్లా నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణను కలిశారు. ఉద్యోగుల సమస్యలను ఆయనకు వివరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి మద్దిలేటి, రమణ, అరుణ కుమారి పాల్గొన్నారు.

'ఆ అధికారి మాకొద్దు'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 29: నంద్యాల జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి గోవింద నాయక్ వేధింపులకు తాళలేక పోతున్నామని, ఆ అధికారి తమకొద్దు అంటూ జిల్లాలోని పశు సంవర్థక వైద్యులు సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గ్యాడ్యుయేట్ వెటర్నియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా నాయకులు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని పశు వైద్యులు గురువారం నంద్యాలలోని పశు సంవర్థక శాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఫెడరేషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రంగన్న, సుబ్బరాయుడు, రాముడు, సుధాకరరెడ్డి, చిన్నబాబు, తదితరులుపాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే



సీఎం చంద్రబాబును కలిసిన భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 29: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం రాష్ట్ర సచివాయంలో సీఎంతో భూమా పలు విషయాలపై చర్చించారు. నంద్యాల అసెంబ్లి నియోజక వర్గ పరిధిలోని రాజకీయ అంశాలను ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృషి సారించాలని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహానందరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు



రమేష్‌బాబు

ఆత్మకూరు, ఆగస్టు 29: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా ఎల్.రమేష్‌బాబు నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హరిప్రసాద్‌ను డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రిపోర్టు చేసుకోవాలని సూచించారు. దీంతో బేతంచెర్ల ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎల్.రమేష్ బాబును ఆత్మకూరుకు బదిలీ చేశారు. ఇదిలావుంటే 2017 నుంచి 2019 వరకు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు తిరిగి మళ్లీ ఆత్మకూరుకు రానున్నారు. సెప్టెంబరు 2వ తేదీన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా బేబి

నందికొట్కూరు: నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా బేబిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బేబి ఎమ్మిగనూరు రెవెన్యూ అఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. గతంలో ఈమె నందికొట్కూరు మున్సిపాల్టీ మేనేజర్‌గాను, మున్సిపల్ కమిషనర్‌గాను విధులు నిర్వహించారు. ప్రస్తుతం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డిని సొంత డిపార్ట్‌మెంట్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

● నగరి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మంజునాథ్‌గౌడ్‌ను నందికొట్కూరు మున్సిపాల్టీ మేనేజర్‌గా నియమించారు. 2024 ఎన్నికల ముందు వరకు నందికొట్కూరు మేనేజర్‌గా విధులు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికలు పూర్తి కావడంతో తిరిగి నందికొట్కూరు మేనేజర్‌గా నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వెలుగోడు, ఆగస్టు 29: మండలంలోని బోయరేవుల గ్రామశివార్లలో ముందు వెళుతున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి కారును, బైక్‌తో ఢీకొట్టి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.ఆత్మకూరు మండలం అమలాపురం గ్రామానికి చెందిన విష్ణు నంద్యాల నుంచి స్వగ్రామమైన అమలాపురంకు బైక్‌పై బయలు దేరారు. అదే మార్గంలో ఓ కారు కూడా వెళుతోంది. బోయరేవుల గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో చేసుకున్న కారును బైక్‌తో వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో విష్ణుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలనానికి చేరుకుని బాధితుడ్ని వైద్యం కోసం వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పంట నమోదును వేగవంతం చేయాలి: జేసీ


నరసాపురంలో పంట నమోదు వివరాలు తెలుసుకుంటున్న జేసీ

రుద్రవరం, ఆగస్టు 29: జిల్లాలో పంట నమోదును వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టరు విష్ణుచరణ్ సూచించారు. మండలంలోని పంట పొలాలను గురువారం సాయంత్రం పరిశీలించి పంట నమోదు వివరాలను వీఏఏ సునీతను అడిగి తెలుసుకున్నారు. అలాగే సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ ఎంత వరకు జరిగిందని అడిగారు. జిల్లాలో 3.23 లక్షల ఎకరాలకు గానూ ఇప్పటి వరకు 55 శాతం పంట నమోదు పూర్తయిందని చెప్పారు. సీసీఆర్‌సీ కార్డులు లక్ష్యం 27,700 కాగా ఇప్పటి వరకు 22500 కార్డులు పంపిణీ చేశారు. రైతుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, తహసీల్దారు మల్లికార్జునరావు, రైతులు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణతో కలిసి రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రవికుమార్, ఏవో రంగనేతాజీ, వీఆర్వో చంద్రనాయక్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు బీసీ రాజారెడ్డి పరామర్శ


గులాం నబీ బాషాను పరామర్శిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 29: బనగాపల్లె పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నేత గులాం నబీబాషా (పూల బాషా) ఇటీవల కిందపడి గాయాలకు గురికావడంతో గురువారం పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పరామర్శించారు. సంబంధిత డాక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆయన కోరారు. పూల కలాం, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

బనగానపల్లె, ఆగస్టు 29: బనగానపల్లె పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బనగానపల్లె పట్టణం రోజురోజుకు దినదినాభివృద్ధి చెందుతున్నదని ఇది ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. పట్టణంలోని అవుకు మెట్ట సమీపంలో రామ్‌కో సిమెంట్ డిస్ట్రిబ్యూషన్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం వెంపర్లాడకుండా స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో గౌండా బాబు, గౌండా మహబూబ్ బాష, రామ్‌కో సిమెంట్ సిబ్బంది, ఆదిహుసేన్ రెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె ఎస్‌ఐగా దుగ్గిరెడ్డి



బనగానపల్లె, ఆగస్టు 29: బనగానపల్లె నూతన ఎస్‌ఐగా దుగ్గిరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ రామిరెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో దుగ్గిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరెడ్డి అనంతపురం జిల్లా కసాపురం ఎస్‌ఐగా పని చేసి బదిలీపై బనగానపల్లె ఎస్‌ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలన్నారు.

మహిళలకు ఎంబ్రాయిడరీపై శిక్షణ

బనగానపల్లె, ఆగస్టు 29: బనగానపల్లె పట్టణంలో ఎంబ్రాయిడరీపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు లావణ్య మహిళా మండలి అధ్యక్షురాలు రోజా రమణి గురువారం తెలిపారు. హ్యాండ్ ఎంబ్రాయిడరీ (మగ్గం వర్కు) నేర్చుకునే మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తామని అన్నారు. వివరాలను 7702224649 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

భాగవత సప్తాహ ఉత్సవాలకు తరలిరండి

డోన్(రూరల్), ఆగస్టు 29: పట్టణం సమీపంలోని రామచంద్ర మాలిక్ బాబా సంస్థానంలో శుక్రవారం నుంచి ఏడు రోజుల పాటు జరిగే అఖండ భాగవత సప్తాహ ఉత్సవాలకు భక్తులు తరలి రావాలని కమిటీ అధ్యక్షుడు ఆలా రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కరపత్రాలను విడుదల చేశారు. కమిటీ ఉపాధ్యక్షుడు జయరాం, సభ్యులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్టు

సంజామల, ఆగస్టు 29: అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రమణయ్య గురువారం తెలిపారు. కోటపాడుకు చెందిన దస్తగిరి, బోయ వెంకటనారాయణ పేరుసోమల సమీపంలోని గాలేరు నగరి కాలువ వద్ద నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి వారి వద్ద నుంచి 5.50 లీటర్ల నాటుసారా స్వాధీనపరుచుకొని అరెస్టు చేసి కోవెలకుంట్ల కోర్టులో హాజరుపరిచారు. వారికి మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బేతంచెర్ల, ఆగస్టు 29: ఆత్మహత్యాయత్నం చేసిన రేగటి మేఘన (22) చికిత్స పొందుతూ కోలుకోలేక నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం మృతి చెందింది. పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో ఉన్న రెడ్ కళాశాల సమీపంలో నివాసముంటున్న చక్రపాణిరెడ్డి భార్య మేఘనను ఆమె తల్లి కవిత కాపురం విషయంలో మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన మేఘన బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. కోలుకోలేక మృతి చెందిందని తల్లి కవిత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

చాగలమర్రి, ఆగస్టు 29: చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల, వాసవీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కమిటీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, హెచ్‌ఎం కోటయ్య, గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, ప్రిన్సిపాల్ శ్యాబుద్దీన్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మహేశ్వరయ్య, టీడీపీ నాయకులు షమీద్దీన్, అజిముద్దీన్, మౌలాలి, నాగరాజు పాల్గొన్నారు.

రుద్రవరం: కేజీబీవీ, గురుకుల విద్యాలయం, ఆదర్శ పాఠశాల ఉన్నత పాఠశాలల్లో తెలుగుభాషా దినోత్సవం, క్రీడాదినోత్సవం నిర్వహించారు. భాషా ఉద్యమానికి కృషి చేసిన గిడుగు వెంకటరామమూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమాల్లో కేజీబీవీ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, హెచ్‌ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: తెలుగు భాష అమ్మవంటిదని, అలాంటి భాషను మరువకూడదని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ ఇష్తీకర్, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, దివాకర్, ప్రభాకర్, షోని, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు ఏపీ మోడల్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని పాతపేట జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ప్రభాకర్ హాజరై మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుం దన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బేతంచెర్ల: గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని మోడల్ స్కూల్‌లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ సంద్రబోయిన బాలకృష్ణ హాజరై మాట్లాడారు. తెలుగు భాషకు కృషి చేసిన కవుల కళాకారుల రచయితల ఛాయా చిత్రాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, తెలుగు ఉపాధ్యాయుడు గంగుల నాగరాజు పాల్గొన్నారు.

● మండలంలోని సీతారామాపురం గ్రామంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు బాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు.

కొలిమిగుండ్ల: అమ్మలాంటి కమ్మనైనది తెలుగు భాష అని మండల విద్యాధికారులు అబ్దుల్‌కలాం, రాజయ్య కొనియాడారు. గురువారం మండలంలోని పేట్నికోట జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు రమణయ్య, గురప్ప, వ్యాయమ ఉపాధ్యాయిని గంగాదేవిలను సన్మానించారు. కార్యక్రమంలో వైవీఎస్ నారాయణరెడ్డి, సుధాకర గుప్త, భాస్కరరెడ్డి, వెంకటేష్‌నాయక్, మద్దిలేటి, మోహన్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఏపీ ఉపాధ్యాయ సంఘం కోవెలకుంట్ల మండల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా, తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, రాజయ్య హాజరయ్యారు. ముందుగా ధ్యాన్‌చంద్, గిడుగురామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు ఫారుక్, అబ్బాస్ పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు నవీన్‌పాటి తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని వివిధ పాఠశాలల్లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవంతోపాటు తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కానాల జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం అరుణ కుమారి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు వారి సేవలను కొనియాడారు.


కోటకందుకూరు ఏపీ మోడల్ పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద ప్రిన్సిపాల్


చాగలమర్రిలో..


ప్యాపిలిలో..


కొలిమిగుండ్ల మండలం పేట్నికోటలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు


సంజామలలో..



కోవెలకుంట్లలో..


డోన్‌లో..

'హిందూ మత ఔన్నత్యాన్ని నలుదిశలా చాటాలి'


గోవిందపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

శిరివెళ్ల, ఆగస్టు 29: హిందూమత ఔన్నత్యాన్ని నలుదిశలా చాటాలని విశ్వహిందూపరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య అన్నారు. విశ్వహిందూపరిషత్ ఏర్పాటు చేసి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని గోవిందపల్లె గ్రామంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, కోలాటం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కిషోర్‌కుమార్, నడిపి సుబ్బారెడ్డి, బజరంగదళ్ నాయకులు నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పార్వతీశం, చంద్ర, భాస్కర్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, నాగమల్లేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఆగస్టు 29: గ్రామాల్లో ప్రజలు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. మండలంలోని రాంపల్లె గ్రామంలో గురువారం ఎఫ్‌డీపీ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. 104 వాహనం ద్వార వైద్య పరీక్షలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శివకాంత్, శేఖర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కొలిమిగుండ్ల పీహెచ్‌సీ వైద్యులు డా.హరిచరణరెడ్డి గురువారం సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన ఆయన సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 29: అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని జిల్లా వికలాంగుల జేఏసీ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎ.దేవరాజ్, సుధాకర్, రాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. బాలిక కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ముందుగా సర్కిల్ కార్యాలయం వద్దకు ప్రజా సంఘాల నాయకులు చేరుకుని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డికి వినతి పత్రం అందించారు. నారాయణరెడ్డి, ఓబులేసు, శ్రీనివాసులరెడ్డి, యోగి, జాకీర్ పాల్గొన్నారు.

'కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు'

చాగలమర్రి, ఆగస్టు 29: గ్రామాల్లో మెడికల్ దుకాణదారులు కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కలందర్‌బాషా హెచ్చరించారు. చాగలమర్రిలోని వివిధ మెడికల్ దుకాణాలను గురువారం తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బిల్లులు సక్రమంగా ఉండాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మెడికల్ దుకాణాలపై ఫిర్యాదులు వస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

సొంత నిధులతో బోరుకు మరమ్మతులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 29: మండలంలోని మీర్జాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పోరెడ్డి చిన్నపురెడ్డి తన సొంత నిధులతో బోరుకు మరమ్మతులు నిర్వహించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కొద్ది రోజుల క్రితం బోరు మరమ్మతుకు గురైనా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో టీడీపీ నాయకులు చిన్నపురెడ్డి బోరుకు మరమ్మతులు చేయించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామోత్సవం

కొలిమిగుండ్ల, ఆగస్టు 29: కొలిమిగుండ్లలో త్యాగరాజ సమేత కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా గురువారం విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల మధ్య గ్రామ వీధుల్లో విగ్రహాలను ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు వాహనాల బహిరంగ వేలం

డోన్(రూరల్), ఆగస్టు 29: డోన్ సబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఎన్‌ఫోర్స్‌మెంటు సూపరింటెండెంట్ సెబ్ ఇన్‌స్పెక్టర్ కే. జయనాథరెడ్డి గురువారం తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు శనివారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని అన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

రుద్రవరం, ఆగస్టు 29: రుద్రవరం ఆదర్శ పాఠశాలకు గురువారం ఆ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడా కిట్లను ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావుకు అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పిల్లలు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.

బహిరంగ చర్చా వేదికలో ఫిర్యాదుల వెల్లువ

రుద్రవరం, ఆగస్టు 29: రుద్రవరం మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై గురువారం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో పీడీ రామచంద్రారెడ్డి సమక్షంలో మండల స్థాయి బహిరంగ చర్చా వేదిక నిర్వహించారు. ఈ చర్చా వేదికలో ప్రజల నుంచి ఫిర్యాదు వెల్లువెత్తాయి. 1279 పనులకు రూ. 9,92,64,136 ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వీటిపై 11 మంది డీఆర్పీలు, ఒక ఎస్‌ఆర్‌పీ, 8 మంది వీఎస్‌ఏలు 13 రోజులు పాటు గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేసి నిగ్గుతేల్చిన బహిరంగ చర్చవేదికలో ఇలా తేలాయి. ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా రూ.7500, రికవరీ రూ.98,382, రూ.3,22,300 విలువ చేసే పనులకు విచారణలో ఉంచారు. రీప్లాంటేషన్ కింద రూ.13,36,228 తేల్చారు. సామాజిక తనిఖీలో వెల్లడి కాని అంశాలు గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో వెల్లడయ్యాయి. గ్రామ వలంటీర్లకు వారానికి మూడు రోజుల పనిదినాలు కల్పించాలని, అయితే ఇక్కడ ఎక్కువ పని దినాలు కల్పించారని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. బుక్‌కీపర్లకు, ప్రైవేటు పాఠశాలల్లో పని చేసేవారికి, చనిపోయిన వారికి, వలంటీర్లకు, పనికి వెళ్లలేని వృద్ధులకు కూడా ఉపాధి పనిదినాలు కల్పించారని, అలాగే జాబ్ కార్డులకు డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులకు పీడీ రామచంద్రారెడ్డి స్పందించి విచారణ అధికారిగా ఏపీడీ సాంబశివరావును నియమించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి షీబారాణి, క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాధర్, డీపీఎం దానం, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఏఈలు వెంకటరాముడు, నాగరాజు, సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ చర్చా వేదికలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న పీడీ రామచంద్రారెడ్డి

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం


ఉపాధ్యాయులను సన్మానించిన ఏపీయూఎస్ నాయకులు

చాగలమర్రి, ఆగస్టు 29: చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, బాలికలను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయిని నాగేశ్వరమ్మ, కల్యాణి, పీఈటీ భారతి సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఏపీయూఎస్ సలహాదారుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, నాయకులు సుబ్బారెడ్డి, ఎంఎస్‌బాబు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్యాపిలి, ఆగస్టు 29: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్రగౌడు అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీలో ఆరోగ్యంపై బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

నీటి తొట్టిని తొలగించారు

ప్రజలకు తప్పిన కష్టాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 29: కొలిమిగుండ్లలో శాంతినగర్‌కు వెళ్లే రహదారిలో అడ్డంగా ఉన్న నీటి తొట్టిని ఎట్టకేలకు అధికారులు తొలగించారు. టీడీపీ నాయకులు గూడురు నాగేశ్వరరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావడంతో, గ్రామ సర్పంచ్ జినుగు శివరాముడు నీటి తొట్టి తొలగించే పనులు చేపట్టారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్‌రావు

బేతంచెర్ల, ఆగస్టు 29: పట్టణంలో గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు అన్నారు. గురువారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు, చైర్మన్ చలంరెడ్డి ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కేంద్ర కమిటీ సభ్యులు గౌరి హుసేన్ రెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, మారుతి కృష్ణ, హరికృష్ణ, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్


ఎక్స్‌కవేటర్ ద్వారా చెట్టును తొలగిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ, ఆగస్టు 29: మండలంలోని మాయలూరు గ్రామ సమీపంలో కోవెలకుంట్ల - జమ్మలమడుగు జాతీయ రహదారిపై భారీ చింత చెట్టు రోడ్డుకు అడ్డంగా విరిగి పడటంతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. గురువారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంతో వీచిన భారీ గాలి, వానకు చెట్టు విరిగి పడింది. దీంతో బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు భారీ ఎత్తున నిలిచిపోయాయి. స్థానికులు ట్రాక్టర్ల సహాయంతో చెట్టును తొలగించే ప్రయత్నం చేసినా సఫలం కాలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి వెంటనే స్పందించి సిబ్బందితో అక్కడికి చేరుకొని ఎక్స్‌కవేటర్ సాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

'ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం'

దొర్నిపాడు, ఆగస్టు 29: ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని వసతులతో కూడిన వైద్యం అందిస్తున్నట్లు డబ్బ్యూ కొత్తపల్లె వైద్యాధికారి ఉసేన్ తెలిపారు. మండలంలోని డబ్బ్యూ గోవిందిన్నె గ్రామంలో గురువారం అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ ఒకటో కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ఎత్తు, బరువు, రక్తహీనత గల చిన్నారులకు అవసరమైన మందులను అందజేశారు. మెడికల్ ఆఫీసర్ హుసేన్, విస్తరణాధికారి నారాయణ, ఆరోగ్య కార్యదర్శి మరియమ్మ, కార్యకర్త రాముడు, ఆపరేటర్ దస్తగిరి, అంగన్‌వాడీ కార్యకర్త తులసీ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

'పార్టీ కోసం కష్టపడటం అభినందనీయం'

రుద్రవరం, ఆగస్టు 29: టీడీపీ కోసం కష్టపడి పని చేయడం అభినందనీయమని ఉందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు మన టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో ప్రచారం చేయడంతో రుద్రవరం నుంచి వార్డు దస్తగిరిని ఎంపిక చేశారన్నారు. మన టీడీపీ యాప్‌ను మరింతగా ప్రజలకు చేరువ చేయాలని తెలిపారు. ప్రశంసా పత్రాన్ని ఎమ్మెల్యే అఖిలప్రియ దస్తగిరికి అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బేతంచెర్ల, ఆగస్టు 29: క్రిష్ణగిరి గ్రామానికి చెందిన బోయ రాముడు అనే వ్యక్తి క్రిష్ణగిరి నుంచి బేతంచెర్లకు వస్తూ కారులో కర్ణాటక మద్యం 96 టెట్రా ప్యాకెట్లను తెస్తుండగా పట్టుకుని కారును సీజ్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య గురువారం తెలిపారు. క్రిష్ణగిరి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన బోయ రాముడు అనే వ్యక్తి తన కారులో కర్ణాటక నుంచి అక్రమంగా 96 టెట్రా మద్యం ప్యాకెట్లను కారులో తీసుకువస్తుండగా.. పోలీసులు తనిఖీ చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేసి నిందితుడ్ని డోన్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించిందని ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.

● **20 లీటర్ల నాటుసారా స్వాధీనం..** చెరుకులపాడు గ్రామం నుంచి బేతంచెర్లకు గురువారం మోటారు సైకిల్‌పై మచ్చ లక్ష్మన్న 20 లీటర్ల నాటుసారా తీసుకువస్తుండగా.. పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ను సీజ్ చేసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూమ్ తెలిపారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించింది.